# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-09-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

1. **ఉత్తర ఈశాన్య రాష్ట్రాల అనుసంధానానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు.**
2. **మహిళల భాగసామ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు.**
3. **ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల సంతృప్తే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వెల్లడించారు.**
4. **శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోని జలాశయాల్లో సమృద్ధిగా చేరిన నీటిని సద్వినియోగం చేసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు.**
5. **ఆసియా కప్ క్రికెట్ సిరీస్‌లో భాగంగా ఈరోజు సాయంత్రం భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి.**

==========================

ఉత్తర ఈశాన్య రాష్ట్రాల అనుసంధానానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ తెలిపారు. రోడ్డు, రైలు, విమానయాన మార్గాలను అనుసంధానిస్తున్నట్లు చెప్పారు. అస్సాంలోని దరాంగ్ జిల్లా మంగళ్ డోయ్ లో దరాంగ్ వైద్య కళాశాలను, నర్సింగ్ కళాశాలను, జీఎన్ఎం పాఠశాలకు ప్రధాన మంత్రి ఈరోజు శంఖుస్థాపన చేశారు. బ్రహ్మపుత్ర నదిపై నిర్మించిన వంతెనను, గౌహతి రింగ్ రోడ్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి మాట్లాడుతూ..

..వాయిస్... 30 సెకన్లు

--------------------------

మహిళల భాగసామ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యమని లోక్ సభ స్పీకర్ ఓం బిర్లా పేర్కొన్నారు. తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ తొలి మహిళా సాధికారత సదస్సులో ఆయన మాట్లాడుతూ... మహిళల అభివృద్ధికి రాజ్యాంగం అనేక అవకాశాలను కల్పించిందన్నారు. మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ ను అమలు చేసేందుకు చట్టం చేశామని చెప్పారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల కారణంగా నేడు అనేక రంగాల్లో మహిళలు నాయకత్వ స్థానాల్లో ఉన్నారని పేర్కొంటూ...

..వాయిస్.. 30 సెకన్లు

మహిళా సాధికారతకు అనేక పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందని పార్లమెంట్ మహిళా సాధికారత కమిటీ ఛైర్‌పర్సన్, పార్లమెంటు సభ్యురాలు దగ్గుబాటి పురందేశ్వరి అన్నారు. బేటీ బచావో–బేటీ పడావో, మహిళా సమ్మాన్ నిధి సహా అనేక పథకాలు అమలు చేస్తున్నట్లు చెప్పారు. తిరుపతిలో నిర్వహిస్తున్న జాతీయ తొలి మహిళా సాధికారత సదస్సులో ఆమె మాట్లాడుతూ..

..వాయిస్...30 సెకన్లు

---

ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజల సంతృప్తే లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఇందుకు అనుగుణంగా మంత్రులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఉండవల్లిలోని క్యాంపు కార్యాలయంలో మంత్రులు, ఉన్నతాధికారులతో నిన్న ముఖ్యమంత్రి సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌర సేవలు, సంక్షేమ పథకాలపై ప్రజా స్పందనను విశ్లేషిస్తున్నామని తెలిపారు. ఈ ఏడాది మొదటి త్రైమాసికంలో 10.5 శాతం వృద్ధి రేటు సాధించామన్నారు. వృద్ధిరేటులో వ్యవసాయం అనుబంధ రంగాలే కీలకంగా ఉన్నాయని చెప్పారు. లక్ష్యాలకు అనుగుణంగా క్షేత్రస్థాయిలో జిల్లా కలెక్టర్లు, రాష్ట్రస్థాయిలో విభాగాధిపతులు పనిచేయాల్సిఉందని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

కాగా.. రాజధాని అమరావతిలో ప్రతిపాదించిన ఎన్టీఆర్ స్మృతివనం ప్రాజెక్టును చేపట్టాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. తెలుగు సంస్కృతీ సంప్రదాయాలు, భాష, సాహిత్యం, కళలు, ప్రాచీన చరిత్ర తదితర అంశాలకు పెద్దపీట వేస్తూ దీనిని చేపట్టాలని ఆయన అధికారులకు దిశా నిర్దేశం చేశారు.

---

శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో జలాశయాల్లో సమృద్ధిగా చేరిన నీటిని సద్వినియోగం చేసుకోవాలని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి సూచించారు. అనంతసాగరం మండలంలోని సోమశిల జలాశయం గేట్లను ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... సోమశిల జలాశయంలో ప్రస్తుతం 74 టీఎంసీల నీరు నిల్వ ఉందన్నారు. ఎగువ ప్రాంతం నుంచి వరద ప్రవాహం కొనసాగుతూ ఉండడంతో ముందు జాగ్రత్తగా 13 వేల 400 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నామన్నారు. పెన్నా నది పరివాహక ప్రాంతంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కండలేరు జలాశయాన్ని కూడా పూర్తి సామర్థ్యంతో నింపుతామన్నారు.

---

భారతదేశ అధికార భాషగా కేంద్ర ప్రభుత్వం హిందీని అమలు పరచిన ఈరోజును హిందీ భాషా దినోత్సవంగా నిర్వహిస్తున్నారు. దేవనాగరి లిపిలో ఉన్న హిందీ భాషను 1949 సెప్టెంబర్ 14వ తేదీన కేంద్ర ప్రభుత్వం అధికార భాషగా గుర్తించి, రాజ్యాంగంలో చేర్చడం వల్ల ఏటా ఈ రోజును హిందీ భాషా దినోత్సవంగా నిర్వహిస్తారు. ప్రపంచ వ్యాప్తంగా హిందీ భాష ప్రాముఖ్యాన్ని తెలియజేయడం, హిందీని అంతర్జాతీయ భాషగా ప్రదర్శించడం ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం. 1963వ సంవత్సరంలో రూపొందించిన అధికార భాషా చట్టం ప్రకారం 1965 నుంచి హిందీ, ఆంగ్ల భాషలు అధికార భాషలుగా కొనసాగుతున్నాయి. భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రజలను ఏకతాటిపై ఉంచడంలో హిందీ భాష ఆ రోజుల్లో ఎంతగానో సహాయపడింది.

---

కేంద్ర ప్రభుత్వం ప్రజలకు ఆర్థిక వెసులుబాటు కల్పించేందుకు అమలు చేస్తున్న భావితరం వస్తు సేవల పన్ను- జిఎస్టీ సంస్కరణలను మహిళలు స్వాగతిస్తున్నారు. ఈ నిర్ణయం వల్ల నిత్యావసర వస్తువుల ధరలు తగ్గనున్నాయని తెలిపారు. సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన కవిత జిఎస్టీ సంస్కరణలపై ఆకాశవాణితో మాట్లాడుతూ..

వాయిస్... 20 సెకన్లు

---------------------------

ఆసియా కప్ క్రికెట్ సిరీస్ లో భాగంగా ఈ రోజు సాయంత్రం భారత్, పాకిస్తాన్ జట్లు తలపడనున్నాయి. దుబాయిలోని ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా ఆసియా కప్ సిరీస్‌లోని గ్రూప్ ఎ విభాగంలో 6వ మ్యాచ్ జరుగనుంది. అయితే భారత్, పాకిస్తాన్ రెండు జట్లు పూర్తి స్థాయి ఫామ్‌లో ఉండటంతో ఈ మ్యాచ్ కీలకంగా మారింది. సూపర్-4లోకి చేరుకోవాలంటే ఇరు జట్లకు గెలుపు తప్పనిసరి. గ్రూప్-ఎలో భాగంగా తొలి లీగ్ మ్యాచ్‌లో భారత జట్టు ఆతిథ్య యుఎఇపై, పాకిస్తాన్ జట్టు ఒమన్ జట్టుపై విజయం సాధించాయి.

---------------------------

పశ్చిమ మధ్య, దాని ఆనుకొని ఉన్న వాయవ్య బంగాళాఖాతంలో ఉత్తర ఆంధ్రప్రదేశ్, దక్షిణ ఒడిషా తీర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని అమరావతిలోని వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో ఈరోజు తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ...

వాయిస్..21 సెకన్లు

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని పలువురు ప్రముఖులు ఈరోజు దర్శించుకున్నారు. విఐపి విరామ సమయంలో స్వామిసేవలో ప్రముఖులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. లోకసభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్ నారాయణ దర్శించుకున్నారు.

=====================